
సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం । 22 । మే । 2024



జాగ్రత్తగా ఓటేయాలి
ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటర్లు నిబంధనల ప్రకారం జాగ్రత్తగా ఓటేయాలని రిటర్నింగ్ అధికారి హరిచందన పేర్కొన్నారు. - 8లో



నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. - 9లో

గరిష్ఠం / కనిష్ఠం
38° / 27°
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'బెస్ట్ అవైలబుల్'కు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి టౌన్ : 2024–25 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో 3,5,8 తరగతుల్లో ప్రవేశానికి గిరిజన విద్యార్థుల(బాలబాలికలు) నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 5 సీట్లు, 5వ తరగతిలో 3 సీట్లు, 8వ తరగతిలో 2 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1,50,000, పట్టణ ప్రాంతాల వారికి రూ.2,00,000కు మించి ఉండరాదన్నారు. దరఖాస్తు ఫారానికి గెజిటెడ్ అధికారి సంతకంతో కూడిన కుల, ఆదాయ, రేషన్, ఆధార్ కార్డులు, జనన ధృవీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలు జత చేసి కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో జూన్ 6వ తేదీ సాయంత్రం 5లోపు అందజేసి రశీదు పొందాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో పొందాలన్నారు.

25 సాయంత్రం నుంచి 27 వరకు వైన్స్‌లు బంద్

సాక్షి, యాదాద్రి : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈనెల ఈనెల 25 సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలు, కల్లు డిపోలను బంద్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఎక్సైజ్ యాక్ట్ 1968, సెక్షన్ 20 (1) ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

చౌటుప్పల్ పీఏసీఎస్ సీఈఓ తొలగింపునకు ఉత్తర్వులు

చౌటుప్పల్ : చౌటుప్పల్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) సీఈఓను విధుల నుంచి తొలగించాలని జిల్లా సహకార అధికారి (డీసీఓ) ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వుల కాపీని పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డికి పంపించారు. మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ సక్రమంగా లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాలల న్యాయ చట్టం అమలు చేయాలి



నిరీక్షణ చైల్డ్‌కేర్ సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలోని నిరీక్షణ చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూట్‌ను పర్యవేక్షణ కమిటీ ప్రతినిధులు మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ ఆధ్వర్యంలో సందర్శించారు. అర్హత కలిగిన పిల్లలను చట్టప్రకారం దత్తత ప్రక్రియలోకి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే సంరక్షణ కేంద్రంలో ఉంటున్న చిన్నారులకు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఉచిత విద్య అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలల చట్టం తప్పనిసరిగా అమలు చేయాలని, అందుకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కేవీ కృష్ణవేణి, బాలరక్ష భవన్ కోఆర్డినేటర్ చందనేశ్వరి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సైదులు డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



ఆంజనేయస్వామికి హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజ ఘనంగా నిర్వహించారు. అంజనీపుత్రుడికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో పూజ జరిపించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో సుప్రభాత సేవ, ఆరాధన, అభిషేకం, అర్చనలు, శ్రీ సుదర్శన హోమం తదితర కైంకర్యాలు గావించారు.

పతాకస్థాయికి ప్రచారం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు దగ్గరపడుతున్న సమయం
- ప్రచారంలో దూకుడు పెంచిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు
- నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు, సన్నాహక సమావేశాలు
- రంగంలోకి రాష్ట్ర స్థాయి నేతలు



భువనగిరిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

సాక్షి యాదాద్రి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారం తుది అంకానికి చేరింది. మరో నాలుగు రోజులు మాత్రమే ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉండడంతో ప్రధాన రాజకీయ పార్టీలు మరింత జోరు పెంచాయి. ఓటర్లను ఆకట్టుకోవడానికి నియోజకవర్గం, మండలాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు , సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నాయి. దీంతో పాటు సోషల్ మీడియాను ప్రచార అస్త్రంగా ఉపయోగించుకుంటున్నాయి. తమను గెలిపిస్తే శాసన మండలిలో పట్టభద్రులు, ఉద్యోగుల సమస్యలపై వాణి వినిపిస్తామని అభ్యర్థులు హామీలు ఇస్తున్నారు.

జోరు పెంచిన బీజేపీ

బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ప్రచారంలో మరింత వేగం పెంచారు. ఆత్మీయ సమ్మేళనాలతో పాటు సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇటీవల భువనగిరిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. భువనగిరిలో బుధవారం మరోమారు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఎంఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించే సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కే.లక్ష్మణ్ హాజరు కానున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాశం భాస్కర్, ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చేజిక్కించుకోవాలన్న పట్టుదలతో కాంగ్రెస్

కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ఆ పార్టీ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల ఐలయ్యతో పాటు జిల్లా నాయకులు ప్రచారంలో పాల్గొంటున్నారు. సన్నాహక సమావేశాల్లో పాల్గొని తమ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల తీరును ఎండగడుతున్నారు. రెండు పార్టీల విధానాల వల్ల నిరుద్యోగులకు, ఉద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని ప్రచారం చేస్తున్నారు. వీరితో పాటు స్థానిక నాయకులు ఎక్కడికక్కడ ప్రచారం చేస్తున్నారు.

సిట్టింగ్ సీటు నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్

సిట్టింగ్ స్థానం కావడంతో బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. ఆలేరు, భువనగిరి నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన సన్నాహక సమావేశాల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఎండగట్టారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, భిక్షమయ్యగౌడ్‌తో పాటు మరికొందరు ముఖ్య నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొంటూ తమ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులను కోరుతున్నారు.

ప్రచార అస్త్రంగా సోషల్ మీడియా..

సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలే కాకుండా సోషల్ మీడియాను అభ్యర్థులు ప్రచార అస్త్రంగా ఉపయోగించుకుంటున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎస్ఎంఎస్ తదితర మార్గాల ద్వారా ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు ఆయా పార్టీల నేతలు ఓటరు జాబితా ఆధారంగా ఓటర్ల సెల్ నంబర్లు సేకరించి ఓటు వేయాలని కోరుతున్నారు.



రాకేష్‌రెడ్డికి పట్టం కట్టండి



నల్లగొండలో జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అభ్యర్థి రాకేష్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

- బ్లాక్‌మెయిలర్ కావాలా.. నిజాయితీపరుడు కావాలా ఆలోచించండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నల్లగొండ, మిర్యాలగూడలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాలు

నల్లగొండ టూటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను శాసన మండలిలో నిలదీసి, నిగ్గదీసి, ప్రశ్నించే గొంతు ఏనుగుల రాకేష్‌రెడ్డికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టం కట్టండి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన వరంగల్ –ఖమ్మం,–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నల్లగొండ నియోజకవర్గ సన్నాహక సమావేశానికి హాజరై మాట్లాడారు. బ్లాక్ మెయిల్, దందాలు చేసే కాంగ్రెస్ అభ్యర్థి కావాలా లేక, ఉన్నత విద్యావంతుడు, నిజాయితీపరుడు రాకేష్‌రెడ్డి కావాలో పట్టభద్రులు ఒకసారి ఆలోచించాలన్నారు. తెలంగాణలో 90 శాతం మంది రైతులు పండించేది దొడ్డు వడ్లు అని, కేవలం సన్న వడ్లకే బోనస్ ఇస్తామని చెబుతూ సీఎం, మంత్రులు.. రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మెగా డీఎస్సీ అన్నారు వేయలేదు, ప్రభుత్వ పరీక్షల ఫీజు తగ్గిస్తామని చెప్పి రూ.2వేలకు పెంచారని ధ్వజమెత్తారు. మాజీమంత్రులు జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి ఎవరో ఎవరికి తెలియదని, కాంగ్రెస్ అభ్యర్థి బ్లాక్‌మెయిలర్ అని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సంపాదించుకునే వ్యక్తి అని, 27న జరిగే ఎన్నికల్లో రాకేష్‌రెడ్డికి ఓటేయాలని కోరారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి చంపుతా అని, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌కు సంబంధించి 56 కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, గాదరి కిషోర్, ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, కర్నె ప్రభాకర్, మందడి సైదిరెడ్డి, నాయకులు చెరుకు సుధాకర్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, కటికం సత్తయ్య గౌడ్, నిరంజన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

30 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటు

మిర్యాలగూడ: కేసీఆర్ హయాంలో నోటిఫికేషన్ వేసి పరీక్షలు నిర్వహించిన 30వేల ఉద్యోగాలకు కేవలం కాల్ లెటర్ ఇచ్చి తామే ఇచ్చినట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడలోని ఎస్‌వీ గార్డెన్‌లో స్థానిక మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అధ్యక్షతన నిర్వహించిన పట్టభద్రుల ఎన్నికల నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న లాంటి బ్లాక్ మెయిలర్‌ను చట్టసభలకు పంపితే చట్టసభలు అబాసుపాలవుతాయన్నారు. పట్టభద్రులు మంచి చెడు ఆలోచించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఎంజీయూ బీఈడీ, డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎంజీయూ వీసీ

నల్లగొండ రూరల్: మహాత్మగాంధీ యూనివర్సిటీ బీఈడీ మొదటి సెమిస్టర్, డిగ్రీ బ్యాక్‌లాగ్ ఫలితాలను మంగళవారం విడుదల చేసింది. బీఈడీ సెమిస్టర్–1, డిగ్రీ మూడేళ్ల బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి.. రిజిస్ట్రార్ అల్వాల రవితో కలిసి విడుదల చేశారు. బీఈడీలో 2,620 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా 1,828 మంది ఉత్తీర్ణులయ్యారు. 789 మంది ప్రమోట్ అయ్యారన్నారు. డిగ్రీ బ్యాక్‌లాగ్ ఫలితాల్లో మొదటి సంవత్సరం 443 మందికి 198 మంది, రెండో సంవత్సరం 549 మందికి 251, తృతీయ సంవత్సరం 1051 మందికి 556 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.


ఎంజీయూ ఇన్‌చార్జి వీసీగా నవీన్ మిట్టల్

ఎంజీయూ ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్‌ను ప్రభుత్వం నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు వీసీగా ఉన్న గోపాల్‌రెడ్డి పదవీకాలం ముగిసింది. రెగ్యులర్ వీసీ వచ్చేంత వరకు మిట్టల్ ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతారు. బుధవారం ఉదయం 11 గంటలకు గోపాల్‌రెడ్డికి వీడ్కోలు, సన్మానం ఏర్పాటు చేసినట్లు రిజిస్ట్రార్ అల్వాల రవి తెలిపారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఐటీఐల కన్వీనర్, నల్లగొండ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి తెలిపారు. మొదటి విడత దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్‌లో జూన్ 10వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

తెలుపు.. ఎరుపు



సూర్యోదయం సమయంలో భానుడు ఎరుపెక్కి ఆకాశం అరుణవర్ణ శోభితంగా మారింది. మూసీలో ప్రతిబింబిస్తూ ఎరుపు, తెలుపు రంగులతో చూపరులకు కనువిందు చేశాడు. ఈ దృశ్యం మంగళవారం పోచంపల్లి మండలం పిల్లాయిపల్లి వద్ద ఆవిష్కృతమైంది. - భూదాన్‌పోచంపల్లి

కాళీయమర్ధనుడిగా.. శ్రీరాముడిగా..



యాదాద్రి ఆలయంలో జరుగుతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం కాళీయమర్ధనుడి అలంకార సేవను ఊరేగిస్తున్న అర్చకులు



హనుమంత సేవపై శ్రీరాముడి అలంకారం

కొనుగోళ్లు వేగవంతం చేయండి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



మర్యాల కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

బొమ్మలరామారం : ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ హనుమంతు అధికారులను ఆదేశించారు. మంగళవారం బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని క్వాంటాళ్లు కొనుగోలు చేశారు, మిల్లులకు దిగుమతి చేసింది ఎంత, కొనుగోలు కేంద్రంలో ఇంకా ఏ మేరకు ధాన్య ఉందనే వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కాంటా వేసిన వడ్లను ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు. వానాకాలం సమీపిస్తున్నందున వారం రోజుల్లో కొనుగోళ్ల పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు బాబు ఉన్నారు.

మోత్కూరు పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

- డీసీఓకు తీర్మానం కాపీ అందజేసిన తొమ్మిది మంది డైరెక్టర్లు
- అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని చైర్మన్‌పై ఆరోపణలు



సంతకాలు చేసిన తీర్మానం కాపీని డీసీఓకు అందజేస్తున్న డైరెక్టర్లు

మోత్కూరు : మోత్కూరు ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డిపై తొమ్మిది మంది డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు తీర్మానం కాపీపై సంతకాలు చేసి మంగళవారం జిల్లా సహకార అధికారి (డీసీఓ) ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. చైర్మన్ అశోక్‌రెడ్డి విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడమే కాకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని డైరెక్టర్లు ఆరోపించారు. పీఏసీఎస్ ఎదురుగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని ఎలాంటి తీర్మానం లేకుండా చేపట్టారని, తానే కాంట్రాక్టర్‌గా అవతారమెత్తి సభ్యులకు తెలియకుండా రూ.50 లక్షలు డ్రా చేశారని పేర్కొన్నారు. సంఘం నిధులతో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్ స్థలాన్ని బినామీల పేరిట చూపించారని, నిరుపయోగంగా ఉన్న బంక్‌కు ప్రతి నెలా రూ.20 వేలు అద్దె చెల్లిస్తున్నారని ఆరోపించారు. అతే కాకుండా ధాన్యం, కందుల కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని, ఎఫ్‌సీఐ అందించిన కమిషన్‌ను సభ్యులకు తెలియకుండా స్వాహా చేశారని స్పష్టం చేశారు. కందుల కొనుగోలు సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఓ ఉద్యోగిని నియమించడంతో రూ.7 లక్షలు నష్టం రాగా మార్క్‌ఫెడ్ నిధుల నుండి చెల్లించారని తెలిపారు. సంఘానికి చెందిన భవనాలు, స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని, చైర్మన్ అశోక్‌రెడ్డి తన ఇష్టారాజ్యంగా చిరు వ్యాపార, మోటార్ సైకిల్ రుణాలు తన అనుచరులకు ఇప్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చైర్మన్ అక్రమాలకు పాల్పడడం వల్లే అతనిపై అవిశ్వాసం ప్రవేశపెట్టాలని మెజార్టీ సభ్యులం తీర్మానం చేసినట్లు వెల్లడించారు.

బోనస్ డబ్బులు స్వాహా చేశారు

2008లో రుణమాఫీ వర్తించని రైతులకు అప్పటి ప్రభుత్వం బోనస్ కింద ఒక్కో రైతుకు రూ.5 వేలు చెల్లించగా అట్టి డబ్బులను అప్పటి చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి స్వాహా చేశారని డైరెక్టర్లు ఆరోపించారు. విచారణ చేపట్టాలని తాము కోరినప్పటికీ తిరస్కరించారని పేర్కొన్నారు. తక్షణమే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చైర్మన్ అశోక్‌రెడ్డిపై అనర్హత వేటు వేయాలని కోరారు. నోటీసు అందజేసిన వారిలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు గుర్రం లక్ష్మీనరసింహారెడ్డి, బయ్యని చంద్రశేఖర్, ఆకుల వెంకటేశ్వర్లు, జిట్టా లక్ష్మయ్య, కారుపోతుల ముత్తయ్య, తాళ్లపల్లి స్వామి, బండ పద్మ తదితరులు ఉన్నారు.

పక్కాగా ఉపాధ్యాయుల హాజరు!

- పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ విధానం
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు
- విద్యాశాఖ నుంచి ఆదేశాలు రాగానే సన్నాహాలు



భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు నమోదులో విద్యాశాఖ నూతన విధానానికి శ్రీకారం చుట్టబోతోంది. ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరు కాకుండా చెక్ పెట్టేందుకు గతంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బయోమెట్రిక్ అమలు చేసింది. సరైన ఫలితాలు రాకపోవడంతో బయోమెట్రిక్‌ను విద్యాశాఖ నిలిపివేసింది. కాగా గత విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల కోసం ఎఫ్ఆర్ఎస్ విధానం అమల్లోకి తీసుకువచ్చారు. 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఉపాధ్యాయులకు కూడా ఎఫ్ఆర్ఎస్(ఫేస్ రికగ్నిషన్ సిస్టం) అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించారు.

పాఠశాలలు, ఉపాధ్యాయులు ఇలా..

జిల్లాలో 712 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ 163, ప్రాథమికోన్నత 68, ప్రాథమిక పాఠశాలలు 481 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం 2,815 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఎఫ్ఆర్ఎస్ విధానం అమలు చేయడంతో విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ విధానం అమలుతో ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా విధులకు హాజరుకావడం, అనుమతి లేకుండా విధులకు డుమ్మా కొట్టడానికి అవకాశం లేకుండా పోతుంది.

ఆన్‌లైన్‌లో నమోదు

ఎఫ్ఆర్ఎస్ విధానంలో ఉపాధ్యాయుల గుర్తింపు సంఖ్యను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఇప్పటికే పాఠశాలలకు ప్రభుత్వం ట్యాబ్‌లను అందజేసింది. సిమ్‌కార్డులు లేకపోవడంతో అవి వృథాగా ఉన్నాయి.ఇటీవల సిమ్ కార్డులను కూడా పాఠశాలలకే కేటాయించారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో మొదట ఉపాధ్యాయుల ముఖ గుర్తింపుతో రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటలలోగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో ఉపాధ్యాయుల హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఫోన్‌లో కూడా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని హాజరు నమోదు చేసేందుకు అవకాశం ఉంది.

ఆదేశాలు రావాల్సి ఉంది



పాఠశాలలో ఎఫ్ఆర్ఎస్ విధానం అమలుపై విద్యాశాఖ నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఆదేశాలు వస్తే పాఠశాలలు ప్రారంభం కాగానే ఉపాధ్యాయులకు ఎఫ్ఆర్ఎస్‌పై అవగాహన కల్పిస్తాం. నూతన విధానం ద్వారా ఉపాధ్యాయుల హాజరు నమోదులో పారదర్శకత ఉంటుంది. ఎవరు ఏ సమయానికి విధులకు వచ్చారో తెలిసిపోతుంది.
–కె.నారాయణరెడ్డి, డీఈఓ

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి

మునుగోడు: మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన గీతకార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. గ్రామస్తులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊకొండి గ్రామానికి చెందిన గీతకార్మికుడు నకరకంటి అంజయ్య(58) రోజువారిగా మంగళవారం ఉదయం గ్రామ సమీపంలో తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు గొలుసు తెగిపోవడంతో పట్టు తప్పి కిందపడిపోయాడు. పక్కనే మరో తాటి చెట్టు ఎక్కుతున్న మరొక గీతకార్మికుడు గమనించి అంజయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి వచ్చి 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో హైదరబాద్‌కు తరలిస్తుడంగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సీహెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భువనగిరి క్రైం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వివరాలు.. తుంగతుర్తి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన జిల్లాల రవీందర్(45) బైక్‌పై సోమవారం రాత్రి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. భువనగిరి పట్టణంలోని డాల్ఫిన్ హోటల్ ఎదుట గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడగా.. స్థానికులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపారు.

టైరు పేలి కారు బోల్తా

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ హైవేపై మంగళవారం కారు టైరు పేలడంతో చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు.. కట్టంగూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వెలిమినేడు శివారులోనికి రాగానే టైరు పగిలిపోయింది. దీంతో కారు హైవే పక్కనే చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న భాస్కర్, అతని భార్య సింధూరతో పాటు కారులో ప్రయాణిస్తున్న లక్ష్మి, పూజకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల స్వస్థలం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం అని తెలిసింది.

వైభవంగా కొనసాగుతున్న జయంత్యుత్సవాలు

- ఉదయం కాళీయమర్దన శ్రీకృష్ణాలంకార సేవలో..
- సాయంత్రం హనుమంత వాహనంపై శ్రీరాముడిగా ఊరేగిన నృసింహుడు
- నేటితో ఉత్సవాలు పరిసమాప్తం


కాళీయమర్దన శ్రీకృష్ణాలంకారంలో స్వామివారు


హనుమంత వాహనంపై శ్రీరామావతార అలంకార సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు, భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంత్యుత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు సుప్రభాతం, అభిషేకం, అర్చనలు, నిత్య హవనములు, మూలమంత్ర జపములు, లక్ష్మీ సూక్త విష్ణుసహస్రనామ పారాయణాలు జరిపించారు. ఉదయం ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల చెంత లక్షపుష్పార్చన పూజలు చేపట్టారు. అనంతరం కాళీయమర్దన శ్రీకృష్ణా అలంకార సేవను మాడ వీధులు, తిరువీధుల్లో ఊరేగించారు.

సాయంత్రం హనుమంత వాహనంపై..

సాయంత్రం ఆలయంలో నిత్య హవనములు, సామూహిక పారాయణాలు, నృసింహ మూలమంత్ర హవనం జరిపించారు. అనంతరం హనుమంత వాహనంపై శ్రీరాముడి అలంకార సేవలో స్వామివారిని ఆలయ మాడ, తిరువీధుల్లో ఊరేగించారు. ఆయా వేడుకల్లో ఆలయ ఈఓ భాస్కర్ రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతగుట్టలో..

యాదాద్రి ఆలయానికి అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జయంత్యుత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం అభిషేకములు, నవకలశ స్నపనము, లక్ష పుష్పార్చన జరిపించారు. సాయంత్రం నృసింహ మూలమంత్ర హవనం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ అధికారులు, ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, అర్చకులు, వేద పారాయణీకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

జయంత్యుత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఉదయం శ్రీయాదాద్రి భక్త భజన సమాజం, శ్రీగాయత్రి మహిళ భజన మండలి యాదగిరిగుట్టచే భజన నిర్వహించారు. సాయంత్రం శారద సంగీత అకాడమీ, అన్నమాచార్య అకాడమీచే భక్తి సంగీతం, శివచంద్ర లహరి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారు, నాగదుర్గ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ప్రముఖ గాయకులు, సంగీత దర్శకులు ఎల్.ఎం.ఎ బాలగంధర్వం వ్యవస్థాపకులు శ్రీరామాచారి బృందంచే భక్తి సంగీత విభావరి జరిపించారు.

ఎల్ఈడీ స్క్రీన్ ప్రారంభం..

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ తూర్పు మాడ వీధిలో బిగించిన ఎల్ఈడీ స్క్రీన్‌ను మంగళవారం ఈఓ భాస్కర్‌రావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. తూర్పు మాడ వీధిలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలయ ముఖ మండపంలో, ప్రథమ ప్రాకార మండపంలో జరిగే స్వామివారి పూజా కార్యక్రమాలను మాడ వీధుల్లో భక్తులు వీక్షించేలా ఎల్ఈడీ స్క్రీన్‌లను బిగించారు.

నేటితో ముగియనున్న ఉత్సవాలు

బుధవారంతో జయంత్యుత్సవాలు ముగియనున్నాయి. ఉదయం 7గంటలకు ప్రధాన ఆలయంలో మూలమంత్ర హవనములు జరిపిస్తారు. ఉదయం 9గంటల నుంచి 9.30గంటల వరకు పూర్ణాహుతి, సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 7గంటలకు నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావం, మహా నివేదన, తీర్థ ప్రసాద గోష్టి జరిపించి ఉత్సవాలను పరిసమాప్తం చేస్తారు.


ఎల్ఈసీ స్క్రీన్‌ను ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు తదితరులు

దీక్ష విరమించిన మాలధారులు


ఆలయ ముఖ మండపంలో ఇరుముడులతో మాలధారులు

నృసింహుడి జయంత్యుత్సవాలను పురస్కరించుకొని మండల దీక్ష చేపట్టిన భక్తులు దీక్షను విరమించారు. 41 రోజుల పాటు మండల దీక్ష చేసిన భక్తులు.. మంగళవారం స్వాతి నక్షత్రం సందర్భంగా ఇరుముడులను ఆలయ అర్చకులకు అప్పగించి దీక్ష విరమించారు.

కూచిపూడి నృత్యం చేస్తూ గిరి ప్రదక్షిణ


కూచిపూడి నృత్యం చేస్తూ గిరి ప్రదక్షిణ చేస్తున్న కళాకారులు

జయంత్యుత్సవాల్లో భాగంగా మంగళవారం యాదాద్రి కొండ కింద వైకుంఠ ద్వారం వద్ద సాంస్కృతిక విశ్వ కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కే. రాంనరసయ్య, కూచిపూడి నృత్య గురువు ప్రసాద్‌రాయుడు, కూచిపూడి నృత్య కళాకారిణి ఆర్. గాయత్రి కూచిపూడి నృత్యం చేస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. ప్రతి స్వాతి నక్షత్రం రోజున నృత్యం చేస్తూ గిరి ప్రదక్షిణ చేస్తామని సాంస్కృతిక విశ్వ కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రాంనరసయ్య తెలిపారు.

● అతిథులొచ్చారు..!





పోచంపల్లి మండలంలోని గౌస్‌కొండ, పెద్దరావులపల్లి చెరువుల్లో సైబీరియన్ కొంగలు సందడి చేస్తున్నాయి. పగలంతా చెరువులు, పంటపొలాల్లో విహరించి రాత్రి వేళ సమీపంలోని చెట్లపై నివాసముంటున్నాయి. ప్రతి ఏటా సైబీరియన్ కొంగలు మూసీ పరీవాహక ప్రాంతమైన పోచంపల్లి మండలానికి వలస వస్తుంటాయి.

– భూదాన్‌పోచంపల్లి

రవీంద్రకుమార్‌ను పరామర్శించిన మాజీ మంత్రులు


కనిలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్, జగదీష్‌రెడ్డి, వి. శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

దేవరకొండ: బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తండ్రి రమావత్ కనిలాల్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కనిలాల్ దశదిన కర్మకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, వి. శ్రీనివాస్‌గౌడ్ హాజరై కనిలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రవీంద్రకుమార్‌ను, అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, గాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య, ఎంపీ అభ్యర్థులు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్, కంచర్ల కృష్ణారెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, బాలరాజుయాదవ్, కిషన్‌నాయక్ తదితరులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకొని వ్యక్తి బలవన్మరణం

మోతె: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకొని వ్యక్తి బలన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మోతె మండల పరిధిలో ఉర్లుగొండ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు.. ఖమ్మం జిల్లా తిర్మలాయపాలెం మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన కంచెం కొమరయ్య(38), రమ భార్యాభర్తలు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా కొమరయ్య భార్య రమ వారం రోజుల క్రితం తన ముగ్గురు ఆడ పిల్లలను తీసుకొని తన తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన కొమరయ్య సోమవారం అర్ధరాత్రి మోతె మండలం ఉర్లుగొండ గ్రామ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు పట్టుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని నెరవేరుస్తాం

- ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్


మాట్లాడుతున్న బల్మూరి వెంకట్, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ తదితరులు

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చెప్పారు. మంగళవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మళ్లీ అన్ని సంక్షేమ పథకాలు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. జీవో నెంబర్ 46, 317, ఇతర ఉద్యోగుల సమస్యలపై తమ ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ వేసి పరిష్కరిస్తుందని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కృషి చేయాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై తీన్మార్ మల్లన్నను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రజా వ్యతిరేక విధానాలపై మల్లన్న పోరాటం చేశాడన్నారు. ప్రశ్నించే గొంతు తీన్మార్ మల్లన్న చట్టసభలలో ఉంటే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో గ్రాడ్యుయేట్ ఓటర్లంతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు గత పది సంవత్సరాలుగా నిరుద్యోగులను అన్ని విధాలుగా మోసం చేశాయని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు విధ్వంసం అయ్యాయన్నారు. కాంగ్రెస్‌తోనే నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వంగూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

పట్టభద్రులు జాగ్రత్తగా ఓటేయాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన



నల్లగొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ రోజు ఓటర్లు నిబంధనల ప్రకారం జాగ్రత్తగా ఓటేయాలని నల్లగొండ కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటర్లు వారు ఓటు వేసే అభ్యర్థికి ఎదురుగా బ్యాలెట్ పేపర్‌తో పాటు ఎన్నికల సంఘం ద్వారా సరఫరా చేయబడిన వాయిలెట్ స్కెచ్ పెన్‌ను మాత్రమే ఉపయోగించాలని పేర్కొన్నారు. ఓటు వేసేందుకు ఎంచుకున్న అభ్యర్థికి ఎదురుగా 1 లేదా 2, 3, 4 ప్రాధాన్యత క్రమంలో అంకెలు మాత్రమే వేయాలని, అక్షరాల రూపంలో రాయొద్దని తెలిపారు. నోటాకు ఓటేయాలనుకుంటే బ్యాలెట్ పేపర్‌పై 1, 2, ప్రాధాన్యతల తర్వాత 3వ ప్రాధాన్యతా ఓటును నోటాకి ఎదురుగా మార్క్ చేయవచ్చని పేర్కొన్నారు.

తీన్మార్ మల్లన్నను పోటీ నుంచి తప్పించాలి

- కలెక్టరేట్ ఎదుట పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి నిరసన



నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జడ్సన్

నల్లగొండ: పట్టభద్రులను బ్లాక్‌మెయిల్ చేస్తున్న కాంగ్రెస్ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను పోటీ నుంచి తప్పించాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి బక్క జడ్సన్ మంగళవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుంగతుర్తి నియోజకవర్గంలో ప్రచారం సందర్భంగా తీన్మార్ మల్లన్న శాసన మండలికి పంపుతారా.. లేకుంటే శ్మశానానికి పంపుతారా.. అని ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేశాడని, దీనిపై ఎన్నికల సంఘానికి, ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జాకు, రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, దీంతో తాను నిరాహార దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. పట్టభద్రులందరిని బ్లాక్ మెయిల్ చేస్తూ మాట్లాడిన కూడా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన నిలదీశారు. పట్టబద్రులు, నిరుద్యోగులు అంతా తనకు మద్దతు పలుకుతున్నారన్న కారణంతో అధికార కాంగ్రెస్ పార్టీ 27 మంది ఎమ్మెల్యేలను, ఏడుగురు మంత్రులను, 34 మంది కోఆర్డినేటర్లను నియమించి తనను ఓడించాలని చూస్తున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా తన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, దీక్ష చేస్తున్న జడ్సన్‌ను పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లారు.

'మహాలక్ష్మి'ల ఆగ్రహం !

- బస్సు ఆపలేదని డ్రైవర్‌ని కొట్టిన మహిళలు
- మిర్యాలగూడ బస్టాండ్‌లో ఘటన

మిర్యాలగూడ అర్బన్: బస్సు ఆపలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బస్సు డ్రైవర్‌పై మహిళలు చేయి చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుకుంది. దేవరకొండ డిపోకు చెందిన బస్సు మిర్యాలగూడకు వస్తున్న సమయంలో అంగడిపేట స్టేజీ వద్ద కొంత మంది మహిళలు చెయ్యి ఎత్తి బస్సును ఆపారు. ఆ బస్సు డ్రైవర్ మహిళలు ఉన్న చోట కాకుండా కొద్ది దూరం వెళ్లి ఆపడంతో అక్కడ ఉన్న మహిళలు కొంతమంది పరిగెత్తుకుంటూ వెళ్లి బస్సు ఎక్కారు. ఈ లోగా బస్సును కదిలించడంతో బస్సు ఎక్కిన మహిళలు మావారు వస్తున్నారు.. బస్సు ఆపాలని డ్రైవర్‌తో అనగా .. వెనకాల మరో బస్సు వస్తుంది.. అంటూ డ్రైవర్ బస్సును నడపడంతో మేము కూడా దిగుతామని బస్సు ఆపాలని చెప్పడంతో బస్సు ఆపి వారందరు దిగిన తరువాత బస్సు వెళ్లిపోయింది. ఆ వెనకాలే వస్తున్న మరో బస్సులో అందరు మహిళలు ఎక్కి మిర్యాలగూడ బస్టాండ్‌కు చేరుకున్న అనంతరం బస్సునుంచి దిగిన మహిళలు ముందుగా వచ్చిన బస్సు డ్రైవర్‌ను బస్సు ఎందుకు ఆపలేదని చేయి చేసుకున్నారు. డ్యూటీలో ఉన్న తనను కొట్టారని సదరు డ్రైవర్ మహిళలపై కేసు పెట్టారు. విషయం తెలుసుకున్న మహిళలు .. ఆ డ్రైవర్ మా అమ్మాయి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ డ్రైవర్‌పై కేసు పెట్టారు. దీంతో అవాక్కైన డ్రైవర్ చేసేది ఏమీ లేక పోలీసుల వద్ద తన గోడును వెల్లబోసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు జోక్యం చేసుకొని ఇరువురితో చర్చించి రాజీకుదిర్చారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు దుర్మరణం

- మరో వ్యక్తికి గాయాలు
- యాదగిరిగుట్ట మండలం సైదాపురం శివారులో ఘటన


శ్రీనివాస్ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం గ్రామ శివారులో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం సాధువెల్లి గ్రామానికి చెందిన గోలి శ్రీనివాస్(36) మగ్గం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం సాధువెల్లి గ్రామం నుంచి బైక్‌పై మంగళశారం మధ్యాహ్నం యాదగిరిగుట్టకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని సైదాపురం గ్రామ శివారులోని కోహినూర్ డైమండ్ వెంచర్ సమీపంలోకి రాగానే, అదే మార్గంలో యాదగిరిగుట్టకు బైక్‌పై కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తున్న యాదగిరిగుట్ట ప్రాంతానికి చెందిన జెల్లా భరత్ వెనుక నుంచి వేగంగా వచ్చి శ్రీనివాస్ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో గోలి శ్రీనివాస్ ఎగిరి కిందపడడంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మరో బైక్‌పై వెళ్తున్న భరత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

మట్టి పరీక్షలకు అనువైన సమయమిదే..

- గడ్డిపల్లి కేవీకే మృత్తికా విభాగం శాస్త్రవేత్త ఎ. కిరణ్


మట్టి నమూనాల సేకరణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త

పాడి పంట

నడిగూడెం: ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమయ్యింది. ఈ సమయంలోనే రైతులు మట్టి నమూనాలు తీసి, వాటిని పరీక్ష చేయించి, ఆ భూసార ఫలితాల ఆధారంగా పంటలు, ఎరువులను ఉపయోగించాలని గడ్డిపల్లి కేవీకే మృత్తికా విభాగం శాస్త్రవేత్త ఎ. కిరణ్ చెబుతున్నారు. మట్టి నమూనా సేకరణకు సంబంధించి తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

- పంట కోత తర్వాత పొలాల్లో నుంచి మట్టిని తీసి పరీక్ష చేయించవచ్చు.
- వేసవిలో పంటలు లేని సమయంలో మట్టిని తీయవచ్చు.
- ఎరువులు వేసిన తర్వాత నెల రోజుల వరకు మట్టి నమూనా తీయరాదు.
- నీరు పెట్టిన తర్వాత తీయరాదు.
- నీడపడే ప్రదేశాలు, నీటి ముంపు ప్రాంతాలు, పెంట కుప్పల దగ్గర, గట్లు, చెట్లు, రోడ్ల దగ్గర మట్టిని తీయరాదు.
- ఒక రకం పొలానికి ఒక నమూనా తీయాలి. పొలం మరీ పెద్దయితే ప్రతి ఐదు ఎకరాలలో నమూనా తీయాలి.
- నేల నిర్మాణం, రంగు, మురుగు పారుదల సౌకర్యం, నేల వాలు, చౌడు, క్షార, గుణాలు, పంటల సరళి మొదలగు విషయాలలో ఏదైనా తేడా కన్పిస్తే అన్ని నమూనాలు ఆ పొలం నుంచి తీయాల్సి ఉంటుంది.
- పైరు పంటలకు 6 అంగుళాల లోతులో మట్టిని నమూనా సేకరించాలి.
- పండ్ల తోటల్లో 5 నుంచి 6 అడుగుల వరకు ప్రతి అడుగుకు ఒక నమూనా తీయాలి.
- కారి, చౌడు, ఆమ్ల నేలలకు అడుగు లోతులో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి.

నమూనాలు ఎలా సేకరించాలి

- నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొదలగు వాటిని తీసివేయాలి.
- గడ్డపార లేదా పారను ఉపయోగించి మట్టి నమూనాను తీయాలి.
- గొయ్యి అంచుల నుంచి పారతో గానీ, తాపీతో గానీ మట్టిని సేకరించాలి.
- పొలంలో 8 నుంచి 10 స్థలాల నుండి మట్టిని సేకరించాలి.
- సేకరించిన మట్టినంతటిని కలిపి నేలపై పరిచి దానిని 4 భాగాలు చేయాలి. మూలలకు ఎదురెదురుగా ఉన్న భాగాల మట్టిని తీసుకొని మిగిలిన మట్టిని పారవేయాలి. ఈ విధంగా 500 గ్రాముల నమూనాలను సేకరించాలి.
- ఈ అరకేజీ మట్టిని గుడ్డ సంచిలో లేదా పాలిథిన్ సంచిలో వేసి, రైతు పేరు, చిరునామానా, సర్వే నంబర్, పొలం విస్తీర్ణం, మెట్ట, పల్లం, ఆరుతడి పంటలు, గత 3 సంవత్సరాలుగా వాడుతున్న ఎరువులు, రాబోవు సీజన్‌లో వేయాల్సిన పంటలు సేకరించిన తేదీ మొదలగు వివరాలను జతచేయాలి.
- సమాచార పత్రంతో కూడిన మట్టి నమూనాలను సంబంధిత వ్యవసాయ అధికారులకు లేదా భూసార పరీక్షా కేంద్రానికి పంపాలి. లేదా గడ్డిపల్లి కేవీకేకు పంపించినా పరీక్షలు చేసి, సాయిల్ హెల్త్‌కార్డు పంపిణీ చేస్తారు.

భూసార పరీక్షల వలన ఉపయోగాలు

- పొలంలో పోషకాల స్థాయి తెలుస్తుంది.
- ఆ పొలంలో ఏయే పంటలు పండించవచ్చో తెలుస్తుంది.
- ఎరువులు ఎంత మోతాదులో, ఎప్పుడు వేయాలో తెలుస్తుంది.
- నేలల సమస్యలు తెలుస్తాయి. దాని ప్రకారం ఎరువులను ఉపయోగించవచ్చును.
- ఎరువుల అనవసరపు ఖర్చు తగ్గించవచ్చు. సరైన సమయంలో భూసార పరీక్షలు చేయిస్తే సేంద్రియ ఎరువులను కూడా ఉపయోగించి నాణ్యమైన పంటలను పండించవచ్చు.